సాక్షి యాదాద్రి భువనగిరి

ఆదివారం । 19 । జనవరి । 2025



ట్రావెల్స్ బస్సులు ఢీ
సూర్యాపేటలో శనివారం తెల్లవారు జామున రెండు ట్రావెల్స్ బస్సులు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. - 8లో



సదుపాయాలు కల్పిస్తున్నాం
గ్రంథాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని సంస్థ జిల్లా చైర్మన్ ఆవేస్ ఉర్ రెహమాన్ చిస్తీ పేర్కొన్నారు. - 9లో



తవ్వారు.. వదిలేశారు
చౌటుప్పల్ పట్టణంలో సర్వీస్ రోడ్ల వెంట చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులను ఇష్టానుసరాంగా నిర్వహిస్తున్నారు. - 9లో

న్యూస్‌రీల్

రేపటి ప్రజావాణి రద్దు

భువనగిరి : కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ హనుమంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో యంత్రాంగం నిమగ్నమై ఉన్నందున ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రామన్నపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిస్ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రాహత్‌ఖానం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్ పోస్టుగ్రాడ్యుయేషన్‌లో జనరల్, బీసీ అభ్యర్థులు 55శాతం, ఎస్సీ ఎస్టీలు 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు ఈనెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

21న జిల్లా క్రీడా జట్ల ఎంపిక పోటీలు

భువనగిరి : ఆలిండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ నేపథ్యంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఈనెల 21న జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ధనుంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అసక్తి గల ఉద్యోగులు తమ సర్వీస్ సర్టిఫికెట్, గుర్తింపు కార్డుతో ఈ నెల 21న ఉదయం 11 గంటలకు భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో హాజరుకావాలని కోరారు. జిల్లాస్థాయిలో రాణించిన ఉద్యోగులు రాష్ట్రస్థాయిలో ఆడాల్సి ఉంటుందన్నారు.

నృసింహుడికి సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం సంప్రదాయ పూజలు ఆగమశాస్త్రం ప్రకారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున శ్రీస్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకార మూర్తులను అభిషేకం, తులసీదళాలతో కొలిచారు. అలాగే ప్రథమ ప్రాకార మండపం, ముఖ మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజ వాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం, నిత్యకల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

నల్లగొండ: నల్లగొండ జిల్లా కేంద్రంలోని సెట్విన్ సాంకేతిక శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు స్వయంఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సెట్విన్ శిక్షణ సంస్థ ఇన్‌చార్జి ఎం.సరిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, ఎంఎస్ ఆఫీస్, ఎలక్ట్రీషియన్, కంప్యూటర్, ప్లంబర్, సెల్ రిపేరింగ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. కోర్సును బట్టి మూడు నెలల నుంచి సంవత్సరకాలం శిక్షణ ఉంటుందని వెల్లడించారు. శిక్షణ పూర్తిచేసిన అభ్యర్థులకు సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నల్లగొండంలోని దేవరకొండ రోడ్డులో గల ప్రతీక్‌రెడ్డి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పక్కన గల సెట్విన్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా సాయంత్రం వేళలో వర్కింగ్ టీచర్స్‌కు కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 97050 41789ను సంప్రదించాలని కోరారు.

చిల్డ్రన్స్ ట్రాఫిక్ పార్క్



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

- పాఠశాలల్లో 'చిల్డ్రన్స్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్'
- కేంద్రం ఆదేశాలతో రాష్ట్రంలో అమలు
- ఉమ్మడి జిల్లాలో 30కి పైగా పాఠశాలల్లో ఏర్పాటుకు సన్నాహాలు

ట్రాఫిక్.. ప్రస్తుతం పట్టణాలు, నగరాలను వేధిస్తున్న సమస్య. కొందరు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్న విషయం తెలిసిందే. కానీ, ట్రాఫిక్ నిబంధనలపై చిన్నతనంలోనే అవగాహన కల్పిస్తే మేలని భావించిన ప్రభుత్వం.. పాఠశాలల్లో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.



మిర్యాలగూడ : భవిష్యత్‌లో రోడ్డు ప్రమాదాలను అరికట్టాలంటే విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ కొత్త విధానాన్ని తీసుకొచ్చారు. దేశ వ్యాప్తంగా యునిసెఫ్ సహకారంతో అన్ని పాఠశాలల్లో చిల్డ్రన్స్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తెలంగాణలో కూడా ఈ పార్క్‌లను ఏర్పాటు చేసి విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ పార్క్‌లను ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

30 పాఠశాలల్లో పార్క్‌లు ఏర్పాటు...

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 30కి పైగా పాఠశాలల్లో పార్క్‌లను ఏర్పాటు చేయాలని రవాణాశాఖ అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే హైదరాబాద్‌లో 15 పాఠశాలల్లో పార్క్‌లు ఏర్పాటుకు సన్నాహాలు చేపట్టారు. త్వరలోనే ఉమ్మడి జిల్లాలో కూడా పార్క్‌లను ఏర్పాటు చేసేందుకు పాఠశాలలను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. సరిపడా స్థలం, వనరులు ఉన్న పాఠశాలలనే ఎంపిక చేయనున్నారు.

రెండు వేల చదరపు గజాల స్థలం తప్పనిసరి..

చిల్డ్రన్స్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ఏర్పాటు కోసం ఆయా పాఠశాలల్లో రెండు వేల చదరపు గజాల స్థలాన్ని కేటాయించాల్సి ఉంది. ఆ స్థలంలో ట్రాఫిక్ నిబంధనలు, సూచికలు, సిగ్నల్స్, బోర్డులతో కూడిన మ్యాప్‌లను కలర్లతో తీర్చదిద్దనున్నారు. దీంతో పాటు ట్రాఫిక్ రూల్స్ చూపేందుకు అవసరమైన మిషనరీని వినియోగించాల్సి ఉంది. దీనికి ఒక్కో పార్క్ ఏర్పాటుకు సుమారు రూ.4లక్షల ఖర్చు అవుతుంది. ఈ ఖర్చు కూడా ఆయా పాఠశాలల యాజమాన్యం భరించాల్సి ఉంటుంది. లేకపోతే ఆయా గ్రామాల్లో దాతల సహకారంతో తీసుకోవచ్చు. ఈ పార్క్‌ను పాఠశాలల్లో ఉండడం వల్ల ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పొందే అవకాశం ఉంటుంది. దీని వల్ల ఆ విద్యార్థి పెరిగి పెద్దయిన తరువాత ట్రాఫిక్ నిబంధనలు పాటించినట్లయితే భవిష్యత్‌లో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి.

అర్హులకే అందాలని..

యంత్రాంగం అంతా పథకాల సర్వేలో నిమగ్నం

- 90 శాతానికి పైగా పూర్తి
- రేపు సాయంత్రం ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేత
- ప్రభుత్వ నిబంధనలతో దరఖాస్తుదారుల్లో ఆందోళన



జానకీపురంలో రైతుభరోసా సర్వేను పర్యవేక్షిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సాక్షి, యాదాద్రి : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేయనున్న నాలుగు పథకాల సర్వేలో జిల్లా యంత్రాంగం అంతా నిమగ్నమైంది. 20వ తేదీ సాయంత్రంలోగా సర్వే పూర్తి చేసి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేసేందుకు సన్నాహాలు చేస్తోంది. శనివారం సాయంత్రం నాటికి 90 శాతానికి పైగా సర్వే పూర్తయ్యింది.

పర్యవేక్షిస్తూ, దిశానిర్దేశం చేస్తూ..

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా ఈనెల 26వ తేదీ నుంచి రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఆహారభద్రత కార్డులు మంజూరు చేయనుంది. పథకాల కోసం ప్రజాపాలనలో ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఇందులో అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం ఈనెల 16వ తేదీన సర్వేకు శ్రీకారం చుట్టింది. 20న సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయాల్సి ఉంది. 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. లబ్ధిదారుల జాబితాను 25వ తేదీన జిలా ఇంచార్జి మంత్రి ఆమోదిస్తారు. 26నుంచి నాలుగు పథకాలు అమలు కానున్నాయి. సకాలంలో సర్వే పూర్తయ్యేలా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. అధికారులు, సిబ్బందితో సమావేశాలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు.

'ఆహారభద్రత'పై ఆందోళన

రేషన్ కార్డుల కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించలేదు. ఇటీవల నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో సేకరించారు. ఈ సర్వే ప్రకారం 14,474 మందితో జాబితా వచ్చింది. దీని ఆధారంగానే ప్రస్తుతం సర్వే చేస్తున్నారు. వీటితో పాటు గతంలో మీసేవ కేంద్రాల ద్వారా వచ్చి సుమారు 26,000 దరఖాస్తులను పరిగణలోకి తీసుకోనున్నారు. ప్రస్తుతం జిల్లాలో 2,13,000 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. దీంతో అర్హత ఉన్నవారు ఆందోళన చెందుతున్నారు.

జాబ్‌కార్డు ఉంటేనే ఆత్మీయ భరోసా..

భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి రూ.12వేలు ఆర్థిక సాయం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఇందుకు కొన్ని నిబంధనలు వర్తింపజేసింది. జాబ్‌కార్డు కలిగిన భూమిలేని కుటుంబాలు 2023–24 సంవత్సరంలో 20 రోజులు ఉపాధి పనుల్లో పాల్గొనాలి. కాగా జిల్లాలో వ్యవసాయ కూలి పనులకు వెళ్లే కుటుంబాలు వందల సంఖ్యలో ఉన్నప్పటికీ చాలా మందికి జాబ్ కార్డులు లేవు. జాబ్‌కార్డు ఉన్న వారు ఉపాధి పనులకు వెళ్లలేదు. దీంతో వారంతా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు దూరమయ్యే అవకాశం ఉంది. 2023–24 లెక్కల ప్రకారం పనిదినాలను చూస్తే 421 గ్రామ పంచాయతీల్లో 16,927 మంది కూలీలు మాత్రమే ఆత్మీయభరోసా పరిధిలోకి రానున్నారు.

సాగు చేస్తేనే పెట్టుబడి సాయం

సాగు భూములు కలిగిన రైతులందరికీ రైతుభరోసా పథకం కింద ఎకరానికి రెండు పంటలకు కలిపి రూ.12 వేలు రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. ఇందుకు సంబంధించి రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే నంబర్ల వారీగా సర్వే చేస్తూ సాగు భూములు, సాగుయేతర భూములను గుర్తిస్తున్నారు. గత ఏడాది యాసంగి సీజన్‌లో 2,48,536 మందికి రైతుబంధు వచ్చింది.

విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలనలో 2,19,077 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 2,04,007 దరఖాస్తుల సర్వే పూర్తయ్యింది. ఇందులోనుంచి ప్రతి నియోజకవర్గంలో 3,500 మందిని ఎంపిక చేయాలి. ప్రాధాన్యత క్రమంలో ఇళ్లను మంజూరు చేయనున్నారు. తొలి విడతలో యాదాద్రి జిల్లాలో కొందరికే ఇళ్లు మంజూరుకానున్నాయి.

స్వర్ణగిరిలో చినజీయర్ పూజలు



స్వర్ణగిరి క్షేత్రంలో స్వామివారిని దర్శించుకున్న చినజీయర్ స్వామి

భువనగిరి : పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రాన్ని శనివారం చినజీయర్ స్వామి ఉత్తర ద్వారం గుండా దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం తిరువీధి ఉత్సవం, సహస్ర దీపాలంకరణ సేవ, నక్షత్ర హారతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంగళ శాసనాలతో పాటు ప్రవచనాల గురించి భక్తులకు వివరించారు. అంతకుముందు జీయర్ స్వామికి ఆలయ ధర్మకర్తలు మానేపల్లి రామారావు, మురళీకృష్ణ, గోపికృష్ణ స్వాగతం పలికారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీ ఇషా స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ నాట్యాలయం నాట్యాచార్యులు సంతోష్ గుప్త, శిరీష ఆధ్వర్యంలో విద్యార్థులు నాట్యం ప్రదర్శించి అలరించారు.

ఇంటర్ విద్య బలోపేతానికి కార్యాచరణ

- ఇంటర్‌బోర్డు జాయింట్ సెక్రటరీ భీమ్‌సింగ్



సంస్థాన్‌నారాయణపురం కళాశాలలో విద్యార్థులకు సూచనలు చేస్తున్న భీమ్‌సింగ్

మోత్కూరు, సంస్థాన్‌నారాయణపురం : ఇంటర్ విద్య బలోపేతానికి కార్యాచరణ రూపొందించినట్లు ఇంటర్‌బోర్డు జాయింట్ సెక్రెటరీ భీమ్‌సింగ్ తెలిపారు. మోత్కూరు, సంస్థాన్‌నారాయణపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను శనివారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతంలోని కళాశాలలకు రవాణా సదుపాయాల కొరత ఉందని, ఇబ్బందులు తొలగిస్తామని తెలిపారు.మధ్యాహ్న భోజన పథకం అమలుకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ఈకార్యక్రమాల్లో ప్రిన్సిపాళ్లు ప్రభాజస్టిస్, మాతేశ్వరి, అధ్యాపకులు ముత్యాలు, మాధవి, రమేష్, లింగయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- కలెక్టర్ హనుమంతరావు



టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న కలెక్టర్ హనుమంతరావు, చిత్రంలో డీఈఓ

భువనగిరి : ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. పదో తరగతి విద్యార్థుల కోసం జిల్లా విద్యాశాఖ రూపొందించిన స్టడీ మెటీరియల్ కరదీపికను శనివారం తన చాంబర్‌లో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో 188 పాఠశాలలకు చెందిన 5,944 మంది విద్యార్థులకు ఇంగ్లిష్, హిందీ, తెలుగు సబ్జెక్టుల కరదీపికలను జిల్లా విద్యాశాఖ రూపొందించిందని, ఇందుకు అవసరమైన ఖర్చును దివీస్ కంపెనీ భరించడం అభినందనీయమన్నారు. ఇప్పటికే దివీస్ కంపెనీ ఆధ్వర్యంలో పాఠశాలల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఈఓ సత్యనారాయణ, ఏడీ ప్రశాంత్‌రెడ్డి, డీసీఈఎస్ సెక్రటరీ పాండు నాయక్, ఏసీజీఈ రఘురాంరెడ్డి, బుక్ డిపో మేనేజర్ రంగారాజన్, ఎంఈఓలో నాగవర్ధన్‌రెడ్డి, లక్ష్మీ, సెక్టోరల్ అధికారులు శ్రీనివాస్, రాధ,లింగారెడ్డి, నరహరి, ప్రధానోపాధ్యాయుడు రమేష్, దివీస్ కంపెనీ మాజమాన్యం కిషోర్‌కుమార్, గోపి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

సాక్షి,యాదాద్రి : రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అర్హులందరికీ అందజేస్తామని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. శనివారం రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సంక్షేమ పథకాల సర్వేపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ, వార్డు సభలు, ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి అర్హులకు రేషన్‌కార్డులు జారీ చేస్తామన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. దరఖాస్తు చేసుకోని వారుంటే గ్రామ, వార్డుల అధికారులకు అందజేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, సివిల్ సప్లై అధికారి వనజాత తదితరులు పాల్గొన్నారు.

శ్రీవాణి విద్యాలయానికి 50 ఏళ్లు



భువనగిరిలోని సాయి కన్వెన్షన్ హాల్‌లో స్వర్ణోత్సవ వేడుకల ఏర్పాట్లు పరిశీలిస్తున్న పూర్వ విద్యార్థులు

- నేడు స్వర్ణోత్సవ వేడుకలు
- హాజరుకానున్న వెయ్యిమంది పూర్వ విద్యార్థులు

భువనగిరి : జిల్లా కేంద్రంలోని శ్రీవాణి విద్యాలయం స్వర్ణోత్సవ వేడుకలకు సిద్ధమైంది. 1974లో స్థాపించిన ఈ పాఠశాలకు ఈనెల 18వ తేదీతో 50 వసంతాలు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు పాఠశాల యాజమాన్యం ఏర్పాట్లు చేసంది. స్థానిక సాయి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే వేడుకలకు సుమారు వెయ్యి మంది పూర్వ విద్యార్థులు హాజరుకానున్నారు.



20వేల మందికి పైగా విద్య

ఇప్పటివరకు 20వేల మందికి పైగా విద్యార్థులు శ్రీవాణి విద్యాలయంలో విద్యనభ్యసించారు. పాఠశాల నిర్వహణ తీరును గుర్తించి అప్పట్లో ఎయిడెడ్ స్కూల్‌గా ప్రభుత్వం గుర్తించింది. దాదాపు పదేళ్ల పాటు ఎయిడెడ్ పాఠశాలగా కొనసాగింది. ఆతరువాత కొందరు ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు పంపడంతో రెండేళ్ల పాటు శ్రీవాణి విద్యాలయం మూతపడింది. పాఠశాల సమితి, పూర్వ విద్యార్థులు సంఘం సహకారంతో రెండేళ్ల క్రితం పాఠశాల తిరిగి పునఃప్రారంభమైంది. పాఠశాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు పాఠశాల సమితి, పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ రాజేశ్‌చంద్రతో పాటు మరికొందరు ఉన్నతాధికారులు హాజరుకానున్నారని నిర్వాహకులు తెలిపారు.

ఉన్నత స్థానాల్లో పూర్వ విద్యార్థులు

శ్రీవాణి విద్యాలయంలో విద్యనభ్యసించిన విద్యార్థుల్లో వందలాది మంది దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. 150 నుంచి 200 మంది వరకు అమెరికాలో ఉన్నారు. అమెరికాలోని ప్రముఖ సైన్స్ శాస్త్రవేత్త శ్రీవాణి విద్యాలయానికి చెందిన విద్యార్థి కావడం విశేషం. ఆయనతో పాటు పాటు పలువురు విద్యార్థులు ఐఏఎస్, డీఎస్పీలు, సీఐలు,ఎస్ఐలు, తహసీల్దార్లు, ఎండీఓలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా పని చేస్తున్నారు. భారత్ సైన్యంలోనూ వివిధ హోదాల్లో ఉన్నారు. అంతేకాకుండా ప్రముఖ వ్యాపారులుగా, జిల్లా, రాష్ట్రస్థాయిలో రాజకీయ నేతలుగా ఎదిగారు.

తప్పలకు తావుండొద్దు

యాదగిరిగుట్ట రూరల్, మోత్కూరు : రైతుభరోసా, ఆత్మీయభరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా చేపట్టాలని, తప్పులకు ఆస్కారం ఉండవద్దని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. శనివారం యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై సర్వేపై సమీక్షించారు. సాగుకు యోగ్యంకాని భూముల విషయంలో జాగ్రత్తగా సర్వే చేయాలన్నారు. అర్హులకే సంక్షేమ ఫలాలు అందాలని, అందుకు సర్వే పక్కాగా ఉండాలని పేర్కొన్నారు. అదే విధంగా మోత్కూరు మండలం పనకడండలో సంక్షేమ పథకాల సర్వేను అదనపు కలెక్టర్ వీరారెడ్డి పర్యవేక్షించారు. అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు దేశ్యానాయక్, రాంప్రసాద్, ఎంపీడీఓలు నవీన్‌కుమార్, బాలాజీ, ఎంపీఓలు సలీం, యాదయ్య, ఏఓలు పాల్గొన్నారు.

'నవోదయ'కు 76.69 శాతం హాజరు

- ఒక్క సీటుకు 44 మంది విద్యార్థులు పోటీ



పెద్దవూరలోని పరీక్ష కేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు

పెద్దవూర : నల్లగొండ జిల్లాలోని చలకుర్తి క్యాంపులో గల జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకుగాను శనివారం నిర్వహించిన ప్రవేశపరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 76.69 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణం తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 27 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో యాదాద్రి భువనగిరి జిల్లాలో 5, సూర్యాపేటలో 9, నల్లగొండ జిల్లాలో 13 కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో 2,329 మందికిగాను 1,803 మంది(77.42శాతం), సూర్యాపేట జిల్లాలో 1,525 మందికి 1,199 మంది (78.62 శాతం), యాదాద్రి భువనగిరి జిల్లాలో 693 మందికి 485 మంది(69.99శాతం) విద్యార్థులు హాజరైనట్లు వెల్లడించారు.

మొత్తం 80 సీట్లు

80 సీట్లకు గాను 4,547 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షకు 3,487 మంది హాజరయ్యారు. 1,060 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఒక్క సీటుకు 44 మంది విద్యార్థులు పోటీ పడినట్లు పేర్కొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ శివప్రసాద్

బొమ్మలరామారం : కేంద్ర, రాష్ట్రాలు ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి లీడ్‌బ్యాంక్ మెనేజర్ శివప్రసాద్ సూచించారు. సైబర్ నేరాలు, బీమా పథకాలు, పెన్షన్ స్కీంలు, సుకన్య సమృద్ధి యోజనపై శనివారం బొమ్మలరామారం మండలం పెద్ద పర్వతాపూర్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాలపై ఖాతాదారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా ఆశచూపి సెల్‌ఫోన్లకు లింకులు, మెసేజ్‌లు పంపుతారని, వాటిని ఓపెన్ చేయవద్దని సూచించారు. పెన్షన్, సుకన్య సమృద్ధి యోజన పథకాల ద్వారా అనేక ప్రయోజనాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మలరామారం టీజీవీబీ మేనేజర్ శిల్ప, మండల కో ఆర్డినేటర్లు ఎలబోయిన విశ్వనాథ్, భానుశ్రీ, ఉమామహేశ్వరి, శ్రీధర్, నరేష్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మనోవేదనతో 'రీజినల్' బాధిత రైతు మృతి


లక్ష్మయ్య (ఫైల్)

వలిగొండ: రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూమి కోల్పోతున్న ఓ రైతు మనోవేదనకు గురై అనారోగ్యంతో మంచాన పడి మృతిచెందాడు. ఈ ఘటన వలిగొండ మండలం వర్కట్‌పల్లి గ్రామంలో శనివారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్కట్‌పల్లి గ్రామానికి చెందిన నాగవెల్లి చినలక్ష్మయ్య (75)కు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో ఎకరం ముప్పై గుంటల భూమిని రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా కోల్పోతున్నాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఇటీవల అతడి కాలికి చిన్న గాయం అయ్యింది. అతడు నిర్లక్ష్యం చేయడంతో అది పెద్ద పుండుగా మారడంతో గత నెలలో వైద్యులు కాలును తీసివేశారు. గత 20 రోజులుగా మంచాన పడిన లక్ష్మయ్య భూమి పోతుందనే మనోవేదనతో అనారోగ్యం బారిన పడి శనివారం మృతిచెందాడు.

బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి అవయవాలు దానం


మల్ల నవీన్ (ఫైల్)

మోటకొండూర్: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటకొండూర్ మండల కేంద్రానికి చెందిన మల్ల నవీన్ (35) తలకు బలమైన గాయం తగిలింది. అతడిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో గల కామినేని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా.. శుక్రవారం బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. వైద్యులు సూచన మేరకు నవీన్ అవయవాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. శనివారం నవీన్ మృతదేహాన్ని మండల కేంద్రానికి తీసుకు రాగా.. బంధుమిత్రులు గ్రామస్తులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీతో తన నివాసం వద్దకు తీసుకెళ్లారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

భువనగిరి: భువనగిరి మండలం రాయగిరి గ్రామ పరిధిలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఫ్లైఓవర్ కింద శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే స్టేషన్ సమీపంలోని ఫ్లైఓవర్ కింద దుర్వాసన వస్తుండడంతో స్థానికులు వ్యక్తి మృతదేహం ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ చంద్రబాబు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయిందని, మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 ఏళ్లు ఉంటాయని, ఐదు రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చని ఎస్ఐ తెలిపారు. మృతుడి గురించిన వివరాలు తెలిసిన వారు రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

రెండు ట్రావెల్స్ బస్సులు ఢీ

- ఇద్దరు మృతి.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఘటన


ప్రమాదానికి కారణమైన ట్రావెల్స్ బస్సు



ధ్వంసమైన ట్రావెల్స్ బస్సు


పఠాన్ నాయబ్ రసూల్ (ఫైల్)


ప్రమోద్‌కుమార్ మృతదేహం

సూర్యాపేటటౌన్: ముందు వెళ్తున్న ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి మరొక ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. ఢీకొట్టిన బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న యోలో ట్రావెల్స్ బస్సును సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్ ఉండటంతో డ్రైవర్ బ్రేక్ వేసి నెమ్మదిగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన జింగ్ ట్రావెల్స్ బస్సు ముందు బస్సును ఢీకొట్టి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. జింగ్ ట్రావెల్స్ బస్సు ముందు అద్దం పగలడంతో ఒంగోలులోని బలరాం కాలనీకి చెందిన బస్సు క్లీనర్ ప్రమోద్‌కుమార్ అలియాస్ సాయి(22) ఎగిరి బస్సు ముందు చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ముందు వెళ్తున్న యోలో ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న గుంటూరుకు చెందిన పఠాన్ నాయబ్ రసూల్(58) బస్సు కుదుపులకు గుండెపోటు రావడంతో మృతిచెందాడు. జింగ్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ యాసిన్‌కు తీవ్ర గాయాలు కాగా.. మరికొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ యాసిన్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రోడ్డుకు అడ్డంగా ఉన్న బస్సును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మృతుడు రసూల్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. క్లీనర్ సాయికి వివాహం కాలేదు. రసూల్ కుమారుడు సల్మాన్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు సూర్యాపేట పట్టణ సీఐ వీరరాఘవులు తెలిపారు.

కుమారుడిని చూసేందుకు వెళ్తూ..

గుంటూరుకు చెందిన పఠాన్ నాయబ్ రసూల్ కార్పెంటర్ పనిచేస్తుంటాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉండగా.. చిన్న కుమారుడు సల్మాన్ ఖాన్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. కుమారుడికి శనివారం, ఆదివారం రెండు రోజులు సెలవులు ఉండటంతో అతడిని చూసేందుకు గుంటూరు నుంచి హైదరాబాద్‌కు శుక్రవారం రాత్రి బయల్దేరగా.. మార్గమధ్యలో మృత్యువు కబళించింది.

బియ్యం నాణ్యత పరిశీలించిన ఫిలిప్పీన్స్ అధికారులు


ఫిలిప్పీన్స్ దేశ అధికారులను, రాష్ట్ర రైస్‌మిల్లు అసోసియేషన్ నాయకులను సన్మానిస్తున్న వజ్రతేజ మిల్లు ఎండీ యాదగిరి


వజ్రతేజ రైస్ మిల్లులో బియ్యంను పరిశీలిస్తున్న ఫిలిప్పీన్స్ అధికారులు, రైస్ మిల్లర్స్ నాయకులు

హాలియా : నల్లగొండ జిల్లా అనుముల మండలం పాలెం గ్రామ సమీపంలోని వజ్రతేజ రైస్‌మిల్లును ఫిలిప్పీన్స్ దేశ క్వాలిటీ అధికారులు శనివారం సందర్శించి బియ్యం నాణ్యతను పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో పండించిన 1010, 1064 రకం వడ్లను బియ్యంగా మార్చి లక్ష టన్నుల బియ్యాన్ని ఫిలిప్పీన్స్ దేశానికి ఎగుమతి చేయడానికి ఆ దేశ ప్రభుత్వంతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందంలో భాగంగా ఫిలిప్పీన్స్ దేశ క్వాలిటీ అధికారులు రైస్ మిల్లులను పరిశీలిస్తున్నారు. రైస్ మిల్లులో స్వయంగా టెస్ట్ మిల్లింగ్ నిర్వహించారు. ఎగుమతి చేసేందుకు బియ్యానికి ఉండాల్సిన నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ బియ్యాన్ని ఎగుమతి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అధికారులకు వారు సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంపా నాగేందర్ మాట్లాడుతూ.. ఫిలిప్పీన్స్ దేశానికి మొదటి దశలో 40 వేల టన్నుల బియ్యం, ఆ తరువాత 60వేల టన్నుల బియ్యాన్ని కాకినాడ పోర్ట్ ద్వారా ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. సీఎంఆర్ కింద అప్పగించే బియ్యంలో 25 శాతం రారైస్‌లో నూకలు కలపాల్సి ఉండగా ఫిలిప్పీన్స్ దేశానికి ఎగుమతి చేసే బియ్యంలో 5 శాతం మాత్రమే నూకలతో ఎగుమతి చేసే ఒప్పందం ఉందని, మిల్లర్లకు నూకల నష్టపరిహారం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఫిలిప్పీన్స్ దేశ అధికారులు, రాష్ట్ర పౌరసరఫరాల అధికారులను వజ్రతేజ రైస్ యాజమాన్యం సన్మానించింది. బియ్యం పరిశీలించిన వారిలో మిల్లింగ్ మార్కెటింగ్ జీఎం భాస్కర్ రావు, ప్రొక్యూర్‌మెంట్ డీజీఎం రాఘవేంద్ర, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్లు సైదులు, మల్లారెడ్డి, విజయభూషన్, నల్లగొండ డీఎం హరీష్, రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మోహన్ రెడ్డి, జగిత్యాల జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగినేని నవీన్, నల్లగొండ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, వజ్రతేజ రైస్ క్లస్టర్ మేనేజింగ్ డైరెక్టర్ చిట్టిపోలు యాదగిరి, హాలియా, నిడమనూరు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పేలపూడి బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

ప్రేమ పేరుతో నమ్మించి..

- బాలికపై యువకుడి లైంగిక దాడి
- కేసు నమోదు చేసిన పోలీసులు

చౌటుప్పల్: ప్రేమ పేరుతో నమ్మించి బాలికపై లైంగిక దాడి చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సంస్థాన్ నారాయణపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక పదో తరగతి చదువుతోంది. యాదగిరిగుట్ట మండలంలోని ఓ గ్రామంలో ఉండే తన మేనమామ ఇంటికి ఇటీవల వెళ్లింది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన యువకుడితో బాలికకు పరిచయం ఏర్పడింది. తనను ప్రేమిస్తున్నానని, పెళ్లి కూడా చేసుకుంటానని సదరు యువకుడు బాలికను నమ్మించాడు. దీంతో ఇద్దరి మధ్య చనువు పెరిగింది. ఈ నెల 8వ తేదీన సదరు యువకుడు బాలికకు ఫోన్ చేసి తన పుట్టినరోజు ఉన్నందున కేక్ కట్ చేసేందుకు తన వద్దకు రావాలని కోరాడు. మొదట ససేమిరా అన్న బాలిక చివరకు అంగీకరించింది. తాను చౌటుప్పల్ వరకు వస్తానని అక్కడికి వచ్చి తీసుకెళ్లాలని యువకుడికి బాలిక సూచించింది. దీంతో సదరు యువకుడు బైక్‌పై వచ్చి చౌటుప్పల్ నుంచి యాదగిరిగుట్ట సమీపంలోని సురేంద్రపురి వద్ద ఉన్న ఓ లాడ్జికి తీసుకెళ్లాడు. లాడ్జిలో ఇద్దరు కలిసి కేక్ కట్ చేశారు. అదే అదనుగా భావించిన యువకుడు బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను తన బైక్‌పై తీసుకొచ్చి చౌటుప్పల్‌లో వదిలిపెట్టి వెళ్లాడు. అక్కడి నుంచి బాలిక తన సొంతూరుకు వెళ్లింది. తాజాగా బాలిక సదరు యువకుడితో కలిసి ఉన్న ఫొటోలను ఇన్‌స్ట్రాగాంలో పోస్ట్ చేసింది. ఆ ఫొటోలను బాలిక తల్లిదండ్రులు గమనించి ఆమెను నిలదీయగా విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో వారు చౌటుప్పల్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

డీసీఎంను ఢీకొట్టిన టవేరా వాహనం

- సిద్దిపేటలో కోదాడ వాసి మృతి

కొండపాక(గజ్వేల్): డీసీఎంను టవేరా వాహనం ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన కొండపాక శివారులో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన సయ్యద్ మేరాజ్ అలీ (45) సిద్దిపేటలో బంధువుల ఇంటికి వెళ్లేందుకు సికింద్రాబాద్ జూబ్లీబస్టాండ్‌లో బస్సు కోసం నిల్చున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు న్యూస్ పేపర్లను తీసుకెళ్లే టవేరా వాహనం రాగానే సిద్దిపేట వరకు వెళ్లేందుకు ఎక్కాడు. కొండపాక శివారులోకి రాగానే రాజీవ్ రహదారి పక్కన ఆగి ఉన్న డీసీఎంను టవేరా వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మేరాజ్ అలీ మృతిచెందగా, డ్రైవర్ రఫీక్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాస్‌తో పాటు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అలీ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కూలిపనులు చేస్తుండగా విద్యుదాఘాతం

- ఇద్దరు మృతి.. మృతుల్లో ఒకరు సూర్యాపేట జిల్లావాసి

కేసముద్రం: బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్ వెళ్లిన ఇద్దరు వ్యక్తులు అక్కడ విద్యుదాఘాతానికి గురై మృతిచెందారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం ఐలయ్యబావితండాకు చెందిన జాటోత్ బాలు(38) తన కుటుంబంతో హైదరాబాద్ వెళ్లి హబ్సిగూడలో ఉంటూ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బాలు.. తన బావమరిది సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం దేవినిగుట్ట తండాకు చెందిన గుగులోత్ మల్లేశం (28)తో కలిసి శుక్రవారం రాత్రి హబ్సిగూడలో కూలిపనికి వెళ్లారు. ఓ భవనానికి ఉన్న బోర్డును తొలగిస్తున్న క్రమంలో విద్యుత్ తీగలకు తాకడంతో షాక్‌కు గురై ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరు చోరీ

భూదాన్‌పోచంపల్లి: వ్యవసాయ క్షేత్రం వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన శనివారం భూదాన్‌పోచంపల్లి మండలం గౌస్‌కొండ గ్రామంలో వెలుగులోకి వచ్చింది. గౌస్‌కొండ గ్రామానికి చెందిన వంగూరి బుచ్చయ్య కుమారుడు స్వామి గౌస్‌కొండ నుంచి రాంలింగంపల్లికి వెళ్లే దారిలోని తమ వ్యవసాయ బావి వద్ద బోరు మోటారు పెట్టేందుకు వెళ్లగా కరెంట్ సరఫరా లేదు. అనుమానం వచ్చి ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూడగా ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరుతో పాటు ఇతర సామగ్రి చోరీకి గురైనట్లు గుర్తించాడు. గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు కట్ చేసి కరెంట్ సరఫరా నిలిపివేసి చోరీకి పాల్పడ్డారు. చోరీకి గురైన కాపర్ వైరు, ఇతర సామగ్రి విలువ రూ.70వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. వెంటనే పోలీసులు, ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇవ్వగా పోలీసులు, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

ఏఎమ్మార్పీ కాల్వలో కొట్టుకొచ్చిన మృతదేహం

గుర్రంపోడు: మండలంలోని వద్దిరెడ్డిగూడెం గ్రామ సమీపంలో గల ఏఎమ్మార్పీ కాల్వలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ, గుర్రంపోడు ఎస్ఐ మధు తెలిపారు. కాల్వలోని కంపచెట్ల వద్ద మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి వయస్సు 40 సంవత్సరాల పైబడి ఉండవచ్చునని, వివరాలు తెలిసిన వారు 8712670157, 8712670228, 8712670207, 8712670227 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం


గట్టు ఉపేందర్ (ఫైల్)

మునగాల: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. వివరాలు.. మునగాల మండలం తాడువాయి గ్రామానికి చెందిన గట్టు ఉపేందర్(42) మఠంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజుమాదిరిగానే శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకుని మఠంపల్లి నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా.. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మునగాల మండల కేంద్రంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కోదాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు శనివారం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఉపేందర్ మృతదేహానికి కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్థానిక ఏఎస్ఐ రత్నం తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉపేందర్ మృతి పట్ల మాజీ వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి వేనేపల్లి వీరబాబు సంతాపం ప్రకటించారు.

బైక్‌పై వెళ్తూ చెట్టును ఢీకొని..

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని న్యూవిజన్ స్కూల్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా జగ్గయ్యపేటకు చెందిన రావి హరిప్రసాద్(30) హైదరాబాద్‌లో బట్టల షాపులో పనిచేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు జగ్గయ్యపేటకు వచ్చి బైక్‌పై శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో హైదరాబాద్‌కు తిరిగి వెళ్తున్నాడు. మార్గమధ్యలో కోదాడ సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హరిప్రసాద్ తీవ్రంగా గాయపడిన మృతిచెందాడు. మృతుడి సోదరుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం ఎస్ఐ రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎదురుగా కారు ఢీకొనడంతో..

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన బోడ నర్సయ్య (47) శుక్రవారం రాత్రి వెలిశాల గ్రామం నుంచి తిరుమలగిరికి బైక్‌పై వస్తుండగా జీబీ తండా సమీపంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సయ్యకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. శనివారం మృతుడి భార్య కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పేలిన ఫ్రిజ్

- ఇంట్లోని సామగ్రి దగ్ధం


కాలిబూడిదైన ఇంట్లోని సామగ్రి

కట్టంగూర్: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లోని ఫ్రిజ్ పేలింది. ఈ ఘటన కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామంలో శనివారం జరిగింది. అయిటిపాముల గ్రామానికి చెందిన కె. నర్సింహాచారి ఇంట్లో శనివారం షార్ట్ సర్క్యూట్ కావటంతో ఫ్రిజ్ పేలి దట్టమైన మంటలు వ్యాపించాయి. దీంతో భయభ్రాంతులకు గురైన నర్సింహాచారి కుటుంబ సభ్యులు ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీశారు. మంటలు ఇల్లంతా కమ్మేయడంతో టీవీ, బియ్యం, ఇతర సామగ్రితో కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేసి ఇంట్లోని గ్యాస్ సిలిండర్‌ను బయటకు తీశారు. సిలిండర్ పేలకపోవటంతో పెను ప్రమాదం తప్పింది.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని శనివారం ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఓటీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వంగపల్లి గ్రామానికి చెందిన సీస అరవింద్ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా గంజాయికి అలవాటు పడిన అతడు హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌కు చెందిన చింటు అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి వంగపల్లి గ్రామానికి తీసుకొచ్చి పలువురికి విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారం తెలుసుకున్న ఎస్‌ఓటీ పోలీసులు శనివారం బైక్‌పై హైదరాబాద్ నుంచి వంగపల్లి గ్రామానికి గంజాయి తీసుకొస్తున్న అరవింద్‌ను వంగపల్లి గ్రామంలో పట్టుకున్నారు. అతడి వద్ద 160 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్, బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని యాదగిరిగుట్ట పోలీసులకు అప్పగించారు. అతడికి గంజాయి సరఫరా చేస్తున్న చింటుపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని ఇండస్ట్రీయల్ పార్కులో యువతి అదృశ్యమైన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన ఓ కుటుంబం ఇండస్ట్రీయల్ పార్క్‌లో వాచ్‌మెన్‌గా పనిచేయడానికి వచ్చారు. వాచ్‌మెన్ తన కుమార్తె(18) అదృశ్యమైందని చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే ఇండస్ట్రీయల్ పార్కులో పనిచేస్తున్న మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురుకు చెందిన కుటుంబంలోని యువకుడే తన కుమార్తెను తీసుకెళ్లి ఉంటాడని యువతి తండ్రి ఫిర్యాదు చేసినట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు

చౌటుప్పల్ రూరల్: రోడ్డు పక్కన నిలబడి ఉన్న మహిళను కారు ఢీకొట్టడంతో గాయపడింది. ఈ ఘటన చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేటలో శనివారం జరిగింది. హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు తుప్రాన్‌పేట గ్రామంలో చౌటుప్పల్ వైపు వెళ్లడానికి యూటర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి కంటైనర్ లారీ కారును ఢీకొట్టగా.. కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే నిలబడి ఉన్న తుప్రాన్‌పేట గ్రామానికి చెందిన కుడుముల మణెమ్మను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మణెమ్మకు కాలు విరిగింది. తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి కుమారుడు రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

కోదాడరూరల్: కుటుంబ కలహాలతో వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీ ఎల్ఐసీ ఆఫీస్ వీధిలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లాకు చెందిన సుబ్బారావు, విజయలక్ష్మి(35) దంపతులు పదేళ్ల క్రితం కోదాడకు వలస వచ్చి ఇక్కడే వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సుబ్బారావు మద్యానికి బానిస కావడంతో తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఎంత చెప్పినా సుబ్బారావు మద్యం మానకపోవడంతో మనస్తాపం చెందిన విజయలక్ష్మి శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. సుబ్బారావు, అతడి కుటుంబ సభ్యులపై మృతురాలి బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై శనివారం రాత్రి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

ముగిసిన 'పెన్నా' ప్రజాభిప్రాయ సేకరణ

- భారీగా పోలీసుల మోహరింపు
- పలువురి ముందస్తు అరెస్ట్


ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్న అధికారులు


హాజరైన ప్రజలు

మిర్యాలగూడ, పాలకవీడు : నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం గణేష్‌పహాడ్ వద్ద గల పెన్నా సిమెంట్స్(అంబుజా) కంపెనీ గనుల విస్తరణ, సున్నపురాయి ఉత్పత్తి పెంపునకై ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోగా.. శనివారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(పీసీబీ) ఆధ్వర్యంలో పరిశ్రమ సమీపంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. 2002లో పెన్నా సిమెంట్స్ పరిశ్రమను ఇక్కడ నెలకొల్పగా.. నాలుగు నెలల క్రితం ఈ ప్లాంట్‌ను అదానీ గ్రూప్ కొనుగోలు చేసింది. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం గణేష్‌పహాడ్ పరిధిలో 304 హెక్టార్లలో, సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం శూన్యపహాడ్ పరిధిలో 50 హెక్టార్లలో మైనింగ్ చేసుకునేందుకు పెన్నా సిమెంట్స్ కంపెనీ గతంలో లీజుకు తీసుకోగా.. ఇప్పుడు ఈ సున్నపురాయి గనులను విస్తరించి తమ కంపెనీ ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏడాదికి 1.5మిలియన్ టన్నుల నుంచి 1.8 మిలియన్ టన్నులకు పెంచుకునేందుకు పరిశ్రమ యాజమాన్యం దరఖాస్తు చేసుకుంది. వివిధ కారణాల వల్ల పీసీబీ ప్రజాభిప్రాయ సేకరణను రెండు సార్లు వాయిదా వేసింది. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో శనివారం రెండు సెషన్లుగా సమావేశాన్ని నిర్వహించి ప్రజల అభిప్రాయాలు స్వీకరించారు. ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. పరిశ్రమ పరిధిలోని గ్రామాల ప్రజలతో పాటు సామాజిక కార్యకర్తలు, పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు తమ తమ అభిప్రాయాలను తెలియజేశారు. పరిశ్రమలు రావడాన్ని స్వాగతిస్తున్నామని నిబంధనలకు లోబడి నడుచుకుంటే మంచిదని కొందరు సూచించారు. స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, గ్రామాల్లో నాణ్యమైన విద్య, వైద్యం, శుభ్రమైన నీరు అందించాలని, సీసీ రోడ్లు నిర్మించాలని, నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు నేర్పించి ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. పరిశ్రమ నుంచి వెలువడే కాలుష్యం అధికంగా ఉందని సామాజిక కార్యకర్తలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సీఎస్ఆర్ ఫండ్‌తో గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పరిశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ.. వలంటీర్ వ్యవస్థ ఏర్పాటుచేసి గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పాలకవీడు మండల పరిధిలోని గ్రామాల నుంచి 22 మంది నేరుగా తమ అభిప్రాయాలు తెలుపగా.. 364 మంది లిఖిత పూర్వకంగా అభిప్రాయాలు తెలియజేశారని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు పేర్కొన్నారు. దామరచర్ల మండల పరిధిలోని గ్రామాల నుంచి 12 మంది నేరుగా తమ అభిప్రాయాలను తెలుపగా, 50 మంది లిఖితపూర్వకంగా అధికారులకు అందించారు. దీనిపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా 30 రోజుల్లో రాతపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈలు సంగీత, విజయలక్ష్మి, నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసులు, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, పరిశ్రమ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు

ఈ ప్రజాభిప్రాయ సేకరణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సూర్యాపేట, నల్లగొండ జిల్లాల ఎస్పీలు సన్‌ప్రీత్‌సింగ్, శరత్‌చంద్రపవార్‌ల ఆధ్వర్యంలో ఐదుగురు డీఎస్పీలు, పది మంది సీఐలు, 30 మంది ఎస్ఐలతో పాటు 500 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పలువురు ప్రజా సంఘాల నాయకులతో పాటు ప్రతిపక్ష నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు.

మౌలిక వసతులు కల్పించాలి



పెన్నా సిమెంట్స్ పరిశ్రమ యాజమాన్యం సమీప గ్రామా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలి. గణేష్‌పహాడ్, వాడపల్లి, శూన్యపహాడ్ గ్రామాల వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి సీఎస్ఆర్ నిధులతో విద్యుత్, తాగునీరు, విద్య, వైద్యం తదితర సౌకర్యాలు కల్పించాలి. పరిశ్రమ యాజమాన్యం ప్రజలకు ఇబ్బందులు లేకుండా కాలుష్యరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి.

– బత్తుల లక్ష్మారెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే

కోర్టును ఆశ్రయిస్తా..



ప్రజలకు ఇబ్బంది కలిగించడంతో పాటు కాలుష్యం వెదజల్లుతున్న పెన్నా సిమెంట్స్ పరిశ్రమపై గతంలో ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాం. ప్రస్తుత ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని చెప్పినప్పటికీ నిర్బంధాలు, ముందస్తు అరెస్టులతో ప్రజాభిప్రాయ సేకరణకు రాకుండా అడ్డుకున్నారు. ఈ విషయంపై కోర్టును ఆశ్రయిస్తా.

– నక్క శ్రీను, శూన్యపహాడ్ వాసి, పాలకవీడు మండలం